కథానిక

# మూడు తరాలు

శ్రీ అంగర వెంకటకృష్ణరావు

హంతకుడి మనసులా వున్న నిశిరాత్రి వేళ అతడు సముద్రపొడ్డు చేరుకున్నాడు. తుపాను రాబోతూన్నట్లుంది. సముద్రం ఆకలిగొన్న పులిలా వుంది. పులి కడుపులో భుభుక్షలా కెరటాలు ఎత్తుగా లేచి పడుతున్నాయి. ఇసక తడితడిగా వుంది. వాతావరణం జిల్లుమంటూంది.

అతడా తడి యిసకలోనే చతికిలబడ్డాడు. దూరంగా అక్కడా అక్కడా చుక్కలు మెరుస్తున్నాయి. భారంగా వాటికేసి అతడు చూశాడు.

అతడనుకుంటున్నాడు—

ఆ చుక్కలలో మహాజీవులుంటారు. వాళ్లు యీ లోకంలో వజ్రాల్లాతరి మెనబడి నలిగేరు. ఇప్పుడు నింగిమీద మెరుస్తున్నారు!

లేక ఆ మెరిసే భాగాలు కిటికీల వజ్రాలతలుపులేమో. పాపపులోకం పడుకోగానే, ఆ మహాజీవులు తమ కిటికీలు తెరుస్తారు. మిలమిల మెరిసే కవాటాలు తెరిచి, యీ లోకంకేసి తొంగిచూస్తారు.

వాళ్ళెప్పుడూ మంచివాళ్లే. ఇక్కడ జీవించిన రోజుల్లో తమ నెవరైతే యాతనపాలు జేశారో వాళ్ళని చూస్తూంటారు. కాని కోపగించుకోరు. అసహ్యపడరు. తెలివిగా వున్నప్పుడు తప్పులు చేసే వీళ్ళని చూసి జాలిపడతారు. తెల్లవార్లు చూసి విలపిస్తారు.

నిద్ర లేస్తే తమ కన్నీళ్లు చూసి, నిజం గుర్తించి వాళ్లకి తాము చేసిన అన్యాయం గ్రహించి యెక్కడ బెగటిల్లిపోతారో అని, తూర్పున తెల్లరేకలు తోచగానే తమ కిటికీల వజ్రాల తలుపులు మూసుకుంటారు.

అతడొక నిట్టూర్పు విడిచాడు.

అయితే యీ చుక్కల్లో ఆమె యెక్కడుంది? ఆమె యెటు వేపు చూస్తూంది.

అతడు పిరికి పిరికిగా ఆకాశంలోకి చూశాడు. కన్నీళ్ళలోంచి అతని దృష్టి భిన్నాభిన్నమౌతూంది.

ఏదీ? ఏదీ? ఆమె నక్షత్రం బహు కాంతివంతంగా వుంటుంది. శుక్రుడిని మించి మెరుస్తూంటుంది. ఆమెవి చెంపకు చేరవేసే సువిశాల నేత్రాలు..

విడిన కలువపూ రేకులవంటి, మంచినీటి ప్రవాహంలోని గండుమీలవంటి ఆమె నేత్రాలు ఆకాశం మీద వెతుక్కుంటున్నాడు.

నాకు నక్షత్రాలతో పరిచయంలేదు. ఏది హస్త, యేది స్వాతి అంటే చెప్పలేను. కాని ఆమెను పోల్చగలను. ఆమె మొలక వజ్రంలా మెరుస్తూంటుంది. ఆమె నీలలోచని. నీలలోచనే!

ఆమె నిగనిగ మెరిసే నీలనేత్రాలు నావెంపు తిప్పి తొలిసారి నన్ను చూసినది నేటికి సరిగా మూడు సంవత్సరాల క్రితం. వెంటనే చకిత కురంగిలా కళవళపడ్డది.

అదిగో ఆమె! ఎలా మెరిసిపోతోందో!

ఆ కిటికీలోంచి చూసినప్పుడల్లా అనుకొనే వాడిని, వర్షానంతరం అద్దంలా నిర్మలంగావున్న నీలాకాశంమీద ఉజ్వలంగా మెరిసే చుక్కలా వుంటుందని. ఇప్పుడీ పురిటిపొద్దుల మేఘాల నడుమ కూడా అలాగే కిటికీ తెరుచుకొని చల్లగా, జాలిగా, కరుణతో మెరుస్తూంది.

ఒక్కసారి రొజ్జగాలి వీచింది. అతడు వడవడలాడి ముడుచుకు కూర్చున్నాడు.

నేనిక్కడికొచ్చిన కొత్తలో మొదట యీమెను చూసి నాకిలాటి చెల్లెలుంటే బాగుండు ననుకున్నా.

అతని గుండెలు దద్దరిల్లేయి. కాని సర్దుకున్నాడు. ధైర్యం నటిస్తూ వొక దగ్గు దగ్గేడు.

అయినా వొకవేళ చెల్లెలంటే మాత్రం ఎంత కాలం వుంటుంది? ఈడొచ్చి పెళ్ళికాగానే అత్తవారింటికి తుఱ్ఱున పారిపోతుంది. అక్కడనుండీ మొగుడూ—ఆ లోకమే! చిలకలా కాపరం చేస్తూ, సినీమాలు చూస్తూ, నన్ను మర్చిపోతుంది.

గుండె బరువుగావున్నా, గొంతులో డగ్గుత్తిక వుక్కిరి బిక్కిరి చేసినా, కళ్లు చెరువులైనా, అతడలాగే పిచ్చి ఆనందంలో నవ్వుకున్నాడు ఆ ఆలోచనకు.

అయితే ఆమె నాకేం కావాలి? అనాడు ఆ ప్రశ్నకు జవాబు అంత సులువుగా లభించలేదు.

రావిచెట్టుమీద యేదో బరువుగా వాలినట్టయింది. ఏదో 'పీచు పీచు'మని ప్రాణసంకటమైన బాధతో ఏడ్చింది గుడ్లగూబ నిద్రపోతూన్న ఏ పైనా గొంతు కొరికిందో. అంతా పది సెకన్ల పని. నిర్మలంగావున్న నా మనసు కలవళపడ్డది.

వెనకనుండి బూట్ల చప్పుడు 'కర్ కర్' మని వినిపించింది. అతను విసురుగా నడుస్తూవొచ్చి నన్ను ఎగాదిగా చూసి, నా భుజాన్ని దూసుకొని నిర్లక్ష్యంగా పోయేడు.

మకిలి 'డాంగరీ' ఇనప జోళ్లు. చెరిగిపోయిన వుంగరాల జుట్టు. చేతిలో సిగరెట్టు. పక్కనుండి వెళ్లిపోతూంటే పుల్లటికంపు కొట్టింది.

అతడలా వెడుతూంటే నా నరాలన్నీ అదిరిపోయినట్టయింది.

ఆ కిటికీ దాటి పోయేడు. అతడిని నీలలోచని చూసింది. కాని చలించలేదు. అల్లానే పడుకుంది. అలానే చూస్తూంది. అతడు తలుపులు తోసుకొని, ఆ యింట్లోకే వెళ్లేడు.

అతడామె కేమౌతాడు? ఎంత ఆలోచించినా యేమవడానికి ఆధారం దొరకడం లేదు. అన్న అనుకోడానికి అవకాశం లేదు. ఆమెను కన్న కడుపు అతడిని కనలేదు!

ఏమైతే నాకెందుకూ—అన్న అయితే నే మంచిది. ఏమీ కాకపోతే మరీ మంచిది. లేకపోతే నీలలోచిని భర్త యేదో పెద్ద ఆఫీసరై వుంటాడు. వీడతని డ్రైవరై వుండవచ్చు. ఏదో భోగట్టా చెప్పడానికి వచ్చివుంటాడు.

అని సమాధానం చెప్పుకొని, ఇంట్లోకి పోయా.

సముద్రం, లేడిపైకి దూకుతూ బెబ్బులి పెట్టిన గాండ్రింపులా హోరుమంది.

అదేమిటి! అమ్మో!! ఎవరో యెవర్నో కొట్టేస్తున్నారు! చితక బాదిచేస్తున్నారు!! ఎవరో స్త్రీ, రోదిస్తూంది బాధపడుతూ! ఎవడో మూర్ఖుడు వేధిస్తున్నాడు, బాధపెడుతూ!

అప్పుడు ఈదురుగాలి రేగింది. రావిచెట్టు ఆకులు రెపరెపలాడిపోతున్నాయి. చెరువునీటిలో నక్షత్రాలు కదిలి, చెదిరి, కరిగిపోతున్నాయి.

ప్రళయం వస్తుందా!!!

"ఆ!!!... అబ్బా!!" సుదీర్ఘంగా వుంది ఆ ఆక్రందనం.

గబగబ వీధిలోకి వెళ్ళా. ఆయింట్లోంచే ఆ వేదనాలాపన. ఆ కిటికీలోంచే మూలుగు.

చిటపట చినుకులు రాలుతున్నాయి కొలనిలో కలువరేకులు కన్నీరు కారుస్తున్నాయి.

వర్షం వెలిసింది. "కర్ కర్" మని బూట్లు చప్పుడుచేస్తూ, ఆ "డాంగరీ" మొఱటుమనిషి మళ్ళీ సూటు వేసుకొని సిగరెటు పీలుస్తూ విసురుగా వెళ్ళిపోయేడు. నా పక్కనుంచి వెడుతూంటే పుల్లటికంపుకొట్టింది. నా గుండెల్లో దడొచ్చింది.

అతడలా బూట్లు 'కర్ కర్' మని చప్పుడు చేసుకుంటూ దూరంగా వెళ్లిపోయి చీకటిలో కలిసిపోయేడు!

స్తంభంలా నిలబడ్డా. చిన్న దీపపు లేతవెలుతురు ఆ కిటికీలోంచి అలుపిస్తూంది. ఆమె అక్కడే పడుకుంది. అల్లాగే నిశ్చలంగా. ఆమె లేలేతనైన, విశాలమైన కనురెప్పలు ముడుచుకున్నాయి. తుమ్మెదరెక్కలవంటి కనురెప్పల వంక్రుకలు నిగనిగ మెరుస్తున్నాయి. ఆ నీలలోచని నిశ్చలంగా, సమాధిలోని యోగిలా, ముంతాజ్ సమాధిలా, జాలినింపుతూ, జాలికోరుతూ, జాలిరూపు ధరించినట్టు పడుంది. నిద్ర, బాధ, బెంగ, దిగులు, నిరాశ ఆమె హృదయపు అట్టడుగు అంతరాళం అనే కొలనిలో యేనుగుల్లా జొరబడి అల్లకల్లోలం చేస్తూంటే, అంచులు తాకిన పిల్ల కెరటాలలా కనురెప్పలు, పెదవులు మెల్లగా కొట్టుకుంటున్నాయి.

నేను చేతనంగా నిలబడ్డా!

"ఏమలా దిస్సపోయి చూస్తున్నావు?"

నేను తృళ్ళిపడి ప్రక్కకు చూశా. నాలాడ్జి ప్రక్క సందులో వున్న గుడి పూజారి. నేను గాభరా పడ్డా. పూజారి నా కళ్ళలోకి దయగా చూశాడు. అతని పెదవిమీద చిరునవ్వు తురగలిస్తోంది. అతడు వానలో తడిసి వస్తున్నాడు. అతని పండు కనుబొమల మీంచి వాననీటి చుక్కలు రాలుతున్నాయి.

నిశిరాత్రి ప్రశాంతం. శివాలయంలోంచి గుడ్డి వెలుతురు మండపంమీద పడుతూంది. అతడు నన్ను దయగా చూచి నవ్వేడు. నా కళ్ళకి అతడే శంకరుడి జటాముకుటంలోని చంద్రుడిలా మెరుస్తున్నాడు. నేను నీలలోచనిని గూర్చి యెన్నో ప్రశ్నలు వేశా ఆతురతతో.

'ఆమె యెల్లప్పుడూ ఆ కిటికీవద్ద అలా పడుంటుందేం? ఆమెకు జబ్బా? ఆమె విశాల నీలలోచనాలలా అపూర్వంగా మెరుస్తూంటాయేం?'

పూజారి యీ ప్రశ్నలకు సమాధానం చెప్ప దలచుకోలేదు. అన్నిటికి వొక చిరునవ్వు నవ్వేడు.

"ఆ మొరటుమనిషి యెవరు? ఆమె కేమౌతాడు? బంధువు కాడనుకుంటా. ఆమె భర్త యేదో పెద్ద కంపెనీలో ఆఫీసరా? షికార్లకు వెళ్ళివుంటాడు. వీడు వాళ్ళ కారు డ్రైవరా? అయితే యిందాకా యెవరు యెవరిని కొట్టారు? ఆమెనే అయివుంటుంది. వీడే కొట్టాడా? డ్రైవరు కేం హక్కుంది?"

ఇదంతా నా స్వగతం కాదు. నేను పూజారిని అడిగిన ప్రశ్న పరంపర. వీటన్నిటికీ ప్రత్యేక సమాధానాల వివరం అనవసరం. అత్యావశ్యకమైన, అతి దారుణమైన సత్యమైన విషయం ఆ మొరటు మనిషి ఆ నీలలోచని భర్త!

పూజారి చెప్తున్నాడు.

"వాడు కార్ఖానాలో పనిచేస్తున్నాడు. వందలకు వంద ఆర్జిస్తాడు. అంతా తాగుతాడు. వీధి కుక్కలకు పెడతాడు. తప్పతాగి చెడిపెల యిళ్ళంట తిరిగి తిరిగి, నిశిరాత్రి వస్తాడు. ఆ పిల్లని కసితీరా కొడతాడు. తన చేతులు నొప్పి పెట్టేవరకూ, తను అలిసిపోయేవరకూ హింసించుతాడు. అలిసి శక్తిలేక పోతే ఎనుబోతులా పడుకుంటాడు. శక్తి యింకా మిగిలివుంటే తిరిగి ఊరిమీద వెళ్ళిపోతాడు."

నాకు వూపిరి సలపలేదు. ఏమనాలో, ఏమనుకోవాలో, యేమని వూహించాలో తెలియలేదు.

వాడికి దయలేదా? దాక్షిణ్యంలేదా? భార్య మీద ప్రేమ లేకపోతే పోయిరి, మానవ సహజమైన కరుణ లేదా?

తిరిగి యిది నా స్వగతం కాదు. నేను పూజారిని వేసిన ప్రశ్నలు. అతడి జవాబు పిడుగువంటిది.

"వాడికి వొక కూతురుంది!"

"ఏమిటీ!!! ఎక్కడ?"

"నాదగ్గిర. ఓనాడు వాడు భార్యను మాటలతో చెప్పలేనంత క్రూరంగా హింసించేడు. చిన్నపిల్ల దివ్వెమీదకూడా పరుసగా ఛెళ్ళుఛెళ్ళున వేశాడు. ఈ దారుణం యెంతకాలం చూడడం? చూస్తూ ఎంత వరకూ వోర్చడం?

ఇంట్లోకి వెళ్ళి పిలను వొళ్ళోకి తీసుకున్నా. భయంతో ఆపిల్ల నా వొళ్ళో దూరి, మొహం దాచుకుని వెక్కుతూంది. నా వేపు వాడు వురిమిచూశాడు. ఆ పిల్లను నాకు యిచ్చేయమని, నేను పెంచుకుంటానని వాడిని బ్రతిమాలా. వాడు "తీసుకుపో!" అని నిర్లక్ష్యంగా కసిరేడు.

తల్లి నావెంపు జాలిగా చూసింది. ఆమె నోటంట నెత్తురు కారుతూంది. ఆమెతో మాట్లాడడానికి పరిస్థితి యేమీ అనుకూలంగా లేదు. ఆమెలోని మాతృవాత్సల్యం గాని, నేనామెకు పిల్లవిషయంలో యివ్వబోయే భరవసా గని, మాటలరూపు ధరించడానికి అది సమయం కాదు.

చెదిరిపోయిన పిల్ల కురులు సరిదిద్ది, దానిని నా గుండెలకు హత్తుకొని, ముద్దిడి వెనుదిరిగా. నేను వెళ్ళిపోయేక వాడామెను తిరిగి కొట్టేడు. తల్లి ఆక్రందనం వినిపిస్తూంటే, నా వొళ్ళో పిల్ల గజగజ వొణికిపోయింది."

పొంగుతూన్న కెరటాన్ని మ్రింగివేయడానికో అన్నట్టు దెయ్యంలా వొక కారుమేఘం చరచర క్రిందికు దిగుతూంది. పూజారి ఆ విషయం చెపుతూన్నప్పుడున్న అతని మనఃప్రవృత్తి జ్ఞప్తికి వచ్చింది.

"నిద్రాణంగా పడివున్న యేదో అనుభూతి శకలం నా గుండెల్లో చైతన్యం పొందుతూంది. అబ్బ! ఎవరు వీళ్ళు! వీళ్ళెందుకిలా బాధపడుతున్నారు! నన్నెందుకిలా బాధపెడుతున్నారు!" అనిపించింది నా వ్యథిత హృదయంలో.

"పూజారీ! వీళ్ల సంగతి నీకు పూర్తిగా తెలిసి వుంటుంది. ఆ నీలలోచని......అంటే ఆ కిటికీలోంచి చూపించే నిర్భాగ్యురాలు యెవరు? ఆ పిల్లకి తలిదండ్రులున్నారా?"

"ఆ కిటికీలోంచి చూపించే అమ్మాయి కర్మను అనుభవిస్తున్న అనంతకోటి జీవరాసులలో ఒకతె. ఆ కిటికీల్లోంచి అవుపించే యే జీవి అయినా అంతే..."

"కాదు తండ్రీ! నా కామె ఆ కిటికీలోంచే మరోలా చూపిస్తూంది. సమాజం యిచ్చిన అన్యాయపు తీర్పు ప్రకారం అనవసరంగా శిక్ష అనుభవిస్తున్న నిర్భాగ్యపు ఖైదీ!"

"నువ్వు కవిత్వం చెపుతున్నావు. జీవితం కవిత్వం కాదు. జీవితం ఒక అప్పువంటిది. మనమీ ప్రపంచానికి బాకీపడ్డాం. ఆ బాకీ తీర్చడంలో కించిత్తైనా విసుగు విరామం లేకుండా పనిచేసి, తిరిగి ప్రపంచంలో బాకీ తీర్చేపద్ధతి రాకుండా చూసుకోవాలి......"

అప్పటినుంచీ నాకు పూజారితో మంచి స్నేహం యేర్పడింది. నీలలోచని కూతుర్ని చూశా. ముమ్మూర్తులా నీలలోచనే!

మొదటిసారి ఆపిల్ల నన్ను చూసి భయంచేత పూజారి సందిట్లోకి దూరింది. ఆ పిల్లకి మగాళ్ళని చూస్తే భయం. ఒక్క పూజారే దయగలవాడని దాని నమ్మకం. తదితర పురుషులందరూ తన తండ్రికిమల్లే నే రాక్షసులని ఆమె భయం!

ఆ పిల్ల కళ్లు అచ్చంగా నీలలోచని కళ్ళల్లాగే విశాలంగా వుంటాయి. కాని అవి తరుచు బెదురుతూంటాయి. ఆ పసి గుండెల్లో లోకం అంటే భీతి వున్నదే కాని, జీవితం అంటే యింకా విరక్తి లేదు.

అది వేసవికాలం. వెన్నెలరాత్రి. నా పెరట్లో చిన్న ఆరామం వుంది. దాంట్లో ఒక మంచం వేసుకుని, తలగడనాత్రం తలక్రింద పెట్టుకుని పడుకున్నా.

రెండురోజుల క్రితం ఆ మోటుమనిషి నీలలోచనిని క్రూరంగా హింసించాడు. ఆ నిస్సహాయురాలు బాధ భరించలేనప్పుడల్లా ఆర్తారవాలు చేసింది గాని, వొక్క యెదురుమాట చెప్పలేదు. దెబ్బలు ఆపుకుందికైనా ప్రయత్నించలేదు. ఆ ఆలోచనలతో నాతల వేడెక్కి అంతవరకూ బాధపడ్డా. అప్పుడే వీస్తున్న మలయ పవనాలకి, చక్కని తెలుకువెన్నెల చల్లదనానికి నా మనసు కొద్దిగా స్థిమితపడింది.

"నన్ను మీరు చూస్తూ వుపేక్ష చేస్తున్నారా? నే పడుతున్న యాతన మీ మనసును కరిగించలేదా?"

నే నులిక్కిపడ్డా. వెడల్పైన నుదురు. నల్లని నొక్కు నొక్కుల కురులు. కలువరేకులవంటి కళ్లు. పాలిపోయి చిక్కిపోయిన చెక్కులు—ఒణికే సన్నని పెదవులు. అందం, జాలి, బాధ ఆకృతిగొన్న నీలలోచని!

"నా గాయములన్నీ పొడై, నొప్పి లేకుతున్నాయి. నాకీ నరకకూపంలోంచి ముక్తిప్రసాదించరా?"

"నేనా!!!" తిరిగి త్రుళ్లిపడ్డా. తెలివొచ్చింది. చిన్నకల—తిరిగి తల వేడెక్కజొచ్చింది. లేచి మంచంమీద కూర్చున్నా.

"నే నామెను రక్షించగలనా" నాలో నేను తీవ్రంగా ప్రశ్నించుకున్నా.

"ఏం చెయ్యాలి? వాడిని అదుపులోకి తీసుకురావాలి"

"అమ్మో! వాడినే!"

నా దండలు చూసుకున్నా. వాడిపోయిన పొట్లకాయలులా వున్నాయి.

"వాడి దండలో! వెధవ సంగిడీ తిప్పుతాడు కామోసు. వుక్కు ముక్కలూ, దుక్క ముక్కలూ! వాడు కలిబడితే అంతే దిక్కు మొక్కు లేకుండా పోతా.

"అయితే నే నిలా ఆమరణనరకం అనుభవించవలసిందేనా? ఇదే నాకు దేవుడు వ్రాసిపెట్టాడా." అన్నట్టయిందామె!

నేను దీర్ఘంగా నిశ్వసించా. "హుం! అలా యెన్నటికీ జరగదు."

"అయితే నన్ను రక్షించండి!" ఆమె కళ్లలో కన్నీళ్లు తొణికిసలాడినట్టయింది.

నా వూహాప్రపంచంలో, ఏదో వొక మహాసముద్రపు టొడ్డున ఎత్తుగా లేచిపకొండ అంచుకు గొలుసులతో బంధింపబడిన "ఏండ్రోమెడా" అగుపిస్తూంది. ఆమెయే యీ నీలలోచని. ఇక గడియకో గంటకో సముద్రపు రాకుసి భీకరాకారంతో వస్తుంది!

వెంటనే నాలో నెత్తురు వేడెక్కింది. నా రక్తనాళాలు స్పందించ జొచ్చేయి. నా దండలు తిరిగి చూసుకున్నా. అదివరకు చూసుకున్నప్పటికన్న బాగా పెరిగాయి. నా ఛాతీకూడా పొంగుతూంది.

"జై పల్లాస్ ఎతినీ!" అని పిడికిలితో గుండెల మీద గుద్దుకున్నా. ధైర్యంగా నే వున్నాను గాని కొంచెం నొప్పెట్టింది. ఊపిరి తిరగలేదు. లేచి రెండు మూడడుగులు పచారుచేసి నెపోలియన్‌లా నిలబడి, చంద్రుడికేసి తల త్రిప్పి "పెరిసియస్! నాలో ఆవహించు" అన్నా. "నీ ఏండ్రొమెడాను సముద్ర రాక్షసినుంచి నువ్వు రక్షించుకున్నట్లు, నీలలోచని అనే ఏండ్రొమెడాను, యీ మొరటు రాక్షసుడి బారినుండి రక్షించే శక్తిని నాలోకి ప్రవహింపజెయ్యి" అని కుడిచెయ్యి పైకెత్తా!

అప్పుడే ఒక గుడ్లగూబ అరిచింది. ఆ నడిరేయి వెన్నెట్లో నా మనసు కలవరపడ్డది. మరి నాకు నిద్రపట్టలేదు.

నా నీలలోచని ఏం చేస్తోందో! నా వెఱ్ఱి నీలలోచని పడుకుంది కామోసు! ఏమీ యెరగదు. వట్టి వెఱ్ఱిబాగులది! వట్టి ఏండ్రొమెడా! నేనొక పెరిసియస్‌నిక్కడ అప్పుడే తయారయానని యెలా వూహించుకుంటుంది!

ఆ రాత్రి రెండు గంటలవేళ, వెళ్ళి వీధిలో నుంచున్నా. నేనొక సమున్నతమైన కాంస్య విగ్రహాన్ని.

ఎవరా చప్పుడు! కర్! కర్! కర్ కర్! బూట్లచప్పుడు. అదే అదే! బూట్ల కిందపడి నలుగుతూన్న యిసుక రేణువుల వేదనా నిస్వనాలు!! కర్ కర్! వాడే! వాడే! సముద్రరాక్షసుడు. కాని నా ముందర బలాదూర్! నా కాళ్లకి సజీవాలైన రెక్కల జోళ్లున్నాయి! (నిజానికసలు జోళ్లే లేవు) నే నెగిరానంటే నా కాళ్లకిందకు వస్తాడా సముద్రరాక్షసుడు!! రా! రా! ఈ రేయి నీ ఆయువు సరి.

వాడు నా ప్రక్కనుంచే నెళ్లేడు. నిర్లక్ష్యంగా వెళ్లేడు. రాసుకుంటూ మరీ వెళ్లేడు. తిప్ప త్రాగివస్తున్నాడు. "రాస్కల్! నీకు నాలాగు యిన్నాళ్లూ గూబగుంయ్‌మనేలా వేసేవాడు లేకపోయేడు!"

అనుకుంటున్నా—ఆవేశం వస్తోంది. వాడు దగ్గరకు వచ్చినప్పుడు 'గుంయ్' మన్నమాట ప్రమాదవశాత్తూ బైటకొచ్చేసింది కామోసు, హఠాత్తుగా వాడు నావేపు తిరిగి, ఒక వషట్కారంచేసి నిర్లక్ష్యంగా పోయేడు.

వాడు నావేపు చూడగానే నా కాళ్లు వణకేయి. గుండెల్లో గుబగుబ బయల్దేరింది. నేను కాంస్య విగ్రహాన్ని కాను. అంత ఎత్తు లేను. వాడే నాకంటె చాలా పొడుగ్గా వున్నాడు. ఆపళంగా అంతే చావవలసిందే నేను. పల్లాస్ ఎతినీ కూడా అడ్డుపడలేదు. నేనుకూడా నీలలోచనిలా నిస్సహాయంగా పడివుండవలసిందే! వాడి దండలు వుక్కు ముక్కలు దుక్క ముక్కలు!!

ఒక అరగంటకాలం అలా వీధిలోనే పచారు చేశా. వాడు నీలలోచనిని కొట్టినట్టు లేదు. ఇవాళ తన కార్యక్రమం మార్చుకున్నాడా? లేక వాడు నా ప్రక్కనుంచి వెళ్ళినప్పుడు నాలోని జాలి అప్రయత్నంగా వాడిలోకి ప్రసారితమయిందా?

"అలా కొట్టకూడదు నాయనా! మనిషంత మనిషిమీద అలా చెయ్యిచేసుకోరాదు. ఆమె నీ భార్య! స్త్రీ—అబల! నిస్సహాయురాలు!! కొట్టొచ్చా?"

అని వాడికి నేను బుద్ధులు చెప్పుకుంటున్నా మనసులోనే!

"ఆ......!" ఎంత కేక!!

"ఆ! ఆ! ఆ!...... ఎంత బాధ!!! ఎన్ని దెబ్బలు! అయ్యో! అయ్యో! వెధవ చంపేస్తాడో యేమో! అయ్యయ్యో! నేను వినలేను! నేను పెరిసియస్‌ను కాను, పల్లాస్ ఎతినీ నాకు ఎందుకు సాయం చేస్తుంది? నేను ఏండ్రొమెడాను రక్షించలేను బాబో!

ఇంట్లోకి పారిపోయా! భయంవేసి వెంటనే నిద్రపోయా. వాడు నీలలోచనిని కొడుతూన్న వొక్కొక్క దెబ్బ నా గుండెల్లో తగులుతూంది. కాని నే నేం చెయ్యను. ఆ విషయంలో ఆమెకంటె నే నేం ఘనుడిని కాను.

ఈ హింస అతనికి పరిపాటి! ఈ బాధ ఆమెకు అలవాటు. ఈ అనంత నాటకంలో, ఈ భయంకర ఛద్మవేషి నిజస్వరూపం యేది అని నా నిత్యసమస్య! ఈ పరమరహస్యం అభేద్యం—ఈ క్రౌర్య ప్రత్యక్షం అమానుషం......

నిన్నటికి సంవత్సరం క్రిందటి మాట యిది. నిన్న రాత్రి అదే ఘట్టం—కాదు అంతకన్న ఘోరమయిన ఘట్టం!

తెల్లవారుఝామున నాలుగు గంటల వేళయింది. బాగా కారుమబ్బు వేసింది. వాతావరణం హఠాత్తుగా చల్లబడిపోయింది. ఉండివుండి వాన జల్లుజల్లుగా పడుతూంది.

దుర్దినాగమన సూచకంగా వుంది. సముద్రపు హోరు మరణదేవత భయంకర రాహ్వానంలా వినవస్తూంది. ఆరు గంటలైనా పిట్టలు లేవలేదు. పొద్దు పొడవలేదు. చలిచలిగా వుంది.

వీధిలోకి వెళ్ళా. వీధి నిర్మానుష్యంగా వుంది. అక్కడ నిశ్శబ్దదేవత పరిపాలిస్తూంది.

ఆ కిటికీదగ్గరకు వెళ్ళా. నీలలోచని అలాగే పడుకుని వుంది. ఆమె చూడడం లేదు. ఏమిలా పరుంది? ఊపిరి తీస్తోందా? అనుమానం వేసింది. కిటికీ చువ్వల దగ్గరగా వెళ్ళి, తేరిపార చూశా. ఆమె తల పగిలింది. నెత్తురు ప్రవహించింది కామోసు గడ్డకట్టింది. నీలలోచని వూపిరి తియ్యటం లేదు! నీలలోచని లేదు!!

తలమీద పిడుగుపడ్డట్టయింది. శరీరం కంపించింది. దృష్టి మందగించింది. పరుగెత్తా పూజారి దగ్గరకు......'

అతడు మతిపోయి సముద్రం కేసి పరాగ్గా చూస్తున్నాడు. ఏంద్రో మెడాని మ్రింగడానికి వస్తూన్న రాక్షసిలా, యముని మహిషంలా వొక పెద్ద కెరటం లేచివస్తూంది. రాక్షసి వచ్చింది. ఏంద్రో మెడాను మ్రింగింది. మునిగిపోయింది. అసంభవం జరిగింది. అన్యాయం జయించింది!

"ఎంత దారుణమయ్యా పూజారీ! ఎంత అన్యాయం! నీలలోచని మరిలేదు. ఆమె వెళ్ళిపోయింది."

నే నెంత విలపిస్తే యేంలాభం. పూజారి గుండె బేజారౌతుందనుకున్నా. నీలలోచని కూతుర్ని మాత్రం సందిట్లోకి తీసుకొని, తల నిమిరి, పది సెకండ్లపాటు తీవ్రత వహించేడు.

పూజారి ఆ పిల్లని నాకు వొప్పజెప్పి నీలలోచని భౌతిక శరీరాన్ని అగ్నికి నైవేద్యం పెట్టడానికి వెళ్ళేడు.

అతడు తిరిగివచ్చేక నీలలోచని పూర్వకథ చెప్పమని బ్రతిమాలా.

"చెప్తా నాయనా! ఇక చెప్పకేం! ఇక నే అభ్యంతరంలేదు. నేనీ చరిత్ర అతిరహస్యంగా దాచివుంచుతానని యెవరికి మాటయిచ్చేనో వారు మాట యిచ్చిన మరుక్షణంలో కళ్ళుమూసేరు. తన తల్లి పడ్డ దురవస్థ తెలిసి దుఃఖించడానికి నేడు యీ పిల్లకూడా లేదు. కానైతే—ఆ జగన్నాటక కర్త ఆడించే యీ మహానాటకంలో రెండు విషాదాంకాలు చూచే ప్రేక్షకత్వమబ్బింది నాకు. భగవద్విలాసం యెంత అనాది, అనంతమో, అంత అనూహ్యం కూడా."

నేను కన్నీళ్ళతో వింటున్నా.

"సుమారు యిరవైసంవత్సరాల క్రితం మాతండ్రి అస్థికలు నిమజ్జనం చెయ్య, దానికి వొక పుణ్యనదీ తీర ప్రదేశానికివెళ్ళా రైలుపూరు సమీపిస్తుందనగా వాతావరణం వర్షాగమన సూచకంగా మారింది.

ఊళ్ళో యెలా దిగానో, నదీ తీరానవున్న సత్రంలో యెలా ప్రవేశించానో ఆ దేవుడికెరుక. కుంభవృష్టి పడుతూంది. తంతు తెలిసినవాడిని కనక యితరుల సహాయం అక్కరలేకుండా ఆ పని నెరవేర్చా. హోరని వానపడుతూంటే, గటోరసి పరుగులు తీసే నదీమతల్లి కడుపులో తండ్రి భౌతిక పరిశేషం కలిపి, నా విధి నెరవేర్చా.

తుండధారగా పడుతూన్న ఆ వానలో యింటిముఖం పట్టడం ప్రమాదకరం అని ఆ సత్రంలో నే రాత్రికి వుండిపోయా. వాన నిముష నిముషానికి హెచ్చిపోతూ, గాలి వానగా మారింది.

కటిక చీకటి—హోరని వాన. ప్రళయసమయ పర్జన్యాలు గర్జిస్తూ విద్యుద్విడిగా ఆ వూరుమీద దాడి చేస్తున్నాయి మెరుపులుండుండి మెరిసి కళ్లు మిరుమిట్లు గొలుపుతున్నాయి నరసంచారం మాటు మణిగిందని వేరే చెప్పక్కరలేదు. తరుచు, యెక్కడో యేదో కూలిపోయిన శబ్దాలు వినిపిస్తున్నాయి. ఎక్కడో తలుపులు, కిటికీలు ఫెడీలు ఫెడీల్న కొట్టుకుంటున్నాయి.

ఇంతలో నేనున్న గది తలుపు శబ్దమయింది. తెరచా. అప్పుడు నా గదిలోకి ఒక కుజ్జివాడు ప్రవేశించాడు.

'ఆ! కుజ్జివాడా! నా గుండెల్లో యేదో వ్రణకిణాంకం కెక్కలింపబడింది. నేను కన్నీళ్ళు తుడుచుకొని, కృంగిపోతూన్న ధైర్యాన్ని కూడదీసుకొని శ్రద్ధగా వింటున్నా.

"ఔను సుమారు యెనిమిదేళ్లుంటాయి..."

"ఆ... నువ్వేనా... ఆ ప్రళయరాత్రి... అబ్బా ...ఏదో గుచ్చుకుంది ..బల్లెంలా...గుండెల్లో."

"ఔను! నాకు బాగా జ్ఞాపకంవుంది. ఆ కుఱ్ఱవాడు తడిసి ముద్దయి పిల్లిలా గజగజ వణికిపోతున్నాడు. ఏడ్చి యేడ్చి వాడి ముఖం వాచిపోయింది. వాడు వెక్కుతూ అన్నాడు—'బాబూ—ఇలా యీ పక్క యింటికి రండి మా అత్త తల పగిలి నెత్తురు కారుతూంది...మా మామే ఆమె తల పగలగొట్టి ఎటో యీ వానలో పారిపోయాడు...'

నాకు జాలి వేసింది.

"ఆ వానలో ఆ కుఱ్ఱవాడిని యెత్తుకుని వాళ్ళింటికి వెళ్ళా. సత్రం పక్కనే వుందా యిల్లు. సుమారు అంతా కూలిపోయింది. నేను వెళ్ళేసరికి ఆ పిల్లడి అత్త రక్తప్రవాహంలో తేలుతూంది. ఆమె గర్భవతి గా కూడా అగుపిస్తూంది.

నన్ను చూడగానే చేతు లెత్తి గండం పెట్టడానికి ప్రయత్నించింది. నేను వారించా. తనపక్కనే పడివున్న సుమారు ఏడాదివయసు పిల్ల వేపు చూపింది.

"తండ్రీ...ఆ పాప నీది......ఎవరికీ యేమీ చెప్పకు" ఆమెకు మాట్లాడడానికి శక్తిలేదు.

"ఏమిటే దురవస్థ? యీ పిల్ల తండ్రి ఎక్కడ? యేమిటే నెత్తురు..."

"దరిద్రం, ఏ బేటా కౌనుపులు మనిషిని రాక్షసిగా మార్చాయి... కాని తండ్రీ—నా బిడ్డకీ దురవస్థ రానీకు—ఈ చరిత్ర యెవరికీ తెలియనీకు..."

"నేను ఆమెకు అభయహస్తం చూపా. ఆమె మరణదేవత హిమశీతలమైన కౌగిలిలో గడ్డకట్టిపోయింది"

పూజారి ఆగాడు. నా గుండెల్లో తుఫాను రేగింది నాకు మూర్ఛ వస్తూన్నట్టుంది. కాని నిభాయించుకోడానికి ప్రయత్నించా. తిరిగి పూజారి కథ అందుకున్నాడు.

"ఆ కుఱ్ఱవాడు నాతో రానన్నాడు. ఎంత బతిమాలినా వినలేదు. నే నా పాపను తీసుకువచ్చా. పన్నెండేళ్లు ప్రాణంతో సరిగా సాకా. కాని పంజరంలో జాగ్రత్తపరచినా, చిలుక వళ్లి బావురుపిల్లి ముందు వాలుంది. అది కర్మయొక్క చమత్కార ప్రవృత్తి ఊహకందని విలాసం...

వీడింత అమానుషం గా తయారవడానికి కారణం అడుగుతావా? అనుభూతివల నే ముక్తిపొందే కర్మ. నేనా కిటికిలోంచి దృష్టి సారిస్తూ గమనించే పరమసత్యం అదే. కాని నువ్వు చూస్తే యింకేదో చూపిస్తుంది. కిటికీ ఒక్కటే అయినా దృష్టులు వేరు. అంచేతే దృశ్యాలు భిన్నంగా వున్నట్టు భ్రమింపజేస్తుందా కిటికీ."

నా కాళ్ల క్రింద భూమి పగిలిపోయింది! నేను దిగజారిపోతూన్నా పాతాళ బిలంలోకి!!

"తండ్రీ నువ్వు చెప్పింది నిజం కావచ్చు. కాని ఆ నిజం దారుణమైనది. నీలలోచని తల్లి ఎంత అన్యాయంగా చనిపోయిందో నువ్వు చూశావు. నాటికి నేను, సుమారిరవైయేళ్ల తరవాత యీ ఘోరం జరిగింది. కాని తండ్రీ భగవంతుడి తోడుగా చెప్పు. దీనిని—యీ పసిపిల్లను యెవరికి వొప్పజెపుతావు!"

"కర్మకు!!!"

......................

"అహాహాహా...ఏమిటీ గాలి..."

ప్రళయం వస్తూందా!!!

నా మెదడు మెఱపుల బొడుపోట్లకు రక్తం స్రవిస్తూంది!

ఆ వేళలాగే యివాళ గాలివాన. అదిగో విశాలాకాశంమీద ప్రళయ పర్జన్యాలు విచ్చలవిడిగా విహరిస్తున్నాయి!!

అమ్మో! ఎంత కెరటమో! ఈ ప్రకృతి సంక్షోభంలో, ఈ హృదయకల్లోలపు టుప్పెనలో ఏమిటా పాట! మూడుతరాల మూగమూలుగు! ఇరవైయేళ్ళ క్రితం యిలాటి రోజునే మా అత్త ఘోరమరణం చూశా! అదొక తరం..తిరిగి నేను...నా నీలలోచని మృతి! ఇది రెండో తరం! ఇంకొక యిరవైయేళ్ళు జీవించలేను. అక్కడనుంచి పరారి అయి యిక్కడకు వచ్చా. ఇక్కడనుంచి యింకెక్కడికి పారిపోయినా, బ్రతికివుంటే నీలలోచని కూతురు నన్ను వెన్నాడుతుంది! బ్రతికలేను మరొక యిరవైయేళ్ళు. చూడలేను మూడోతరంలోని ఘోరంహత్య!

అదుగో పాట! దీనాలాపం. రమ్మంటూంది మూడుతరాల మూక వేదనానుభూతిగీతం...కెరటాల చేతులెత్తి—హోరెత్తి పిలుస్తూంది!

"నీలలోచనీ—లోచనీ!"

అదిగో మూడుతరాల మూగవేదన, కొంతంతా విచ్చి, సమున్నతమైన కెరటంగా రెచ్చి...వస్తూంది...